# ట్రిపుల్‌ఐటీ ఓ అద్భుత ప్రపంచం

## పంజాబ్ విద్యాధికారుల సందర్శన



సంచాలకులు ఇబ్రహీంఖాన్‌తో మాట్లాడుతున్న పంజాబ్ ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి రోషన్ సుంకారియా

**నూజివీడు, న్యూస్‌టుడే:** గ్రామీణ పేద విద్యార్థులకు అత్యున్నత స్థాయి సాంకేతిక విద్యను అందిస్తున్న నూజివీడు ట్రిపుల్‌ఐటీ ఓ అద్భుత ప్రపంచం (ఐల్యాండ్ ఆఫ్ ఎక్సలెన్స్) అంటూ పంజాబ్ రాష్ట్ర ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి రోషన్ సుంకారియా కొనియాడారు. గురువారం సాయంత్రం నూజివీడు ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఆయన సాయంత్రం 3.30 గంటల నుంచి 6 గంటల వరకు ఇక్కడి విద్యా విధానం, మౌలిక సదుపాయాలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుంకారియా మాట్లాడుతూ ఇక్కడి విద్యా విధానం, వసతి, మౌలిక సదుపాయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు భగవంతుడు ఇచ్చిన వరమంటూ కితాబిచ్చారు. పంజాబులోని గ్రామీణ యువతకు ఇటువంటి విద్యా విధానాన్ని అందించాలనే లక్ష్యంతో పంజాబ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చామన్నారు. విశాల ప్రాంగణం, తరగతి గదులు, భోజన, వసతి సౌకర్యాలు, ప్రయోగశాలలు విద్యార్థులను బహుముఖంగా తీర్చిదిద్దడానికి అనువుగా ఉన్నాయన్నారు. ఉపకార వేతనాల స్థానంలో ఇటువంటి విద్యను అందించడం ఇతరులకు మార్గదర్శకమన్నారు. ఇటువంటి విద్యాసంస్థను పంజాబ్‌లో ఏర్పాటు చేయడానికి తాను తమ ముఖ్యమంత్రికి సిఫార్సు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి విద్యాసంస్థలో గ్రామీణ ప్రతిభను వెలికితీసి దేశ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములను చేయడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మెంటార్లు, అధ్యాపకుల అంకితభావం, చిత్తశుద్ధి అభినందనీయమన్నారు. దీనికి ముందు రోషన్.. ట్రిపుల్ ఐటీ సంచాలకులు ఆచార్య ఇబ్రహీంఖాన్‌తో భేటీ అయి విద్యాసంస్థ వివరాలను, ప్రవేశాలు, బోధనా విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో మొత్తం 7,670 మంది విద్యార్థులు ఉన్నారని ఇబ్రహీంఖాన్ తెలిపారు. ఈ ఏడాది బయటకు వెళ్లబోయే మొదటి బ్యాచ్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఇప్పటి వరకు 92.51గా ఉందని చెప్పారు. డ్యుయల్ డిగ్రీ, విద్యేతర అంశాల్లో ఇచ్చే శిక్షణ తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా రోషన్ క్యాంపస్ మొత్తం తిరిగి తరగతి గదులు, వసతి భవనాలు, భోజనశాలలు, ప్రయోగశాలలు తదితరాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఉన్నత విద్య రాజమండ్రి ప్రాంత సంయుక్త సంచాలకులు కె.గంగేశ్వరరావు, విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాచార్యుడు వి.రవి, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాచార్యుడు ఇల్లా రవి, ట్రిపుల్‌ఐటీ ఆచార్యుడు రామనరసింహం, ఓఎస్‌డీ జీఆర్కే రెడ్డి, పీఆర్వో ఐ.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.